క్లుప్తంగా

దొంగతనాలపై అప్రమత్తంగా ఉండాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఆర్పీఎఫ్ ఏఎస్సై వెంకటేశ్వరరావు

భీమవరం: రైళ్లలో ప్రయాణించేటప్పుడు దొంగతనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆర్పీఎఫ్ ఏఎస్సై వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక శ్రీఆదిత్య డిగ్రీ కాలేజీలో రైళ్లల్లో ప్రయాణించేటపుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మాదక ద్రవ్యాలకు, చెడు అలవాట్లకు, అపరిచిత వ్యక్తులకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్పీఎఫ్ హెడ్ కానిస్టేబుల్ వీబీఎస్ రెడ్డి, కళాశాల డైరెక్టర్ ఎం శ్రీనివాస్, ప్రిన్సిపాల్ ఎ.అనురాధ, వైస్ ప్రిన్సిపాల్ మావుళ్లు, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ బ్రహ్మం, సురేష్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న అల్లూరి నాటకం



అల్లూరి సీతారామరాజు నాటకంలోని ఓ సన్నివేశం

భీమవరం(ప్రకాశం చౌక్): శ్రీమావుళ్లమ్మవారి 60వ వార్షిక మహోత్సవాల్లో భాగంగా శనివారం సాయంత్రం అమ్మవారి దేవస్థానం వద్ద ప్రదర్శించిన విప్లవ జ్యోతి అల్లూరి సీతారామరాజు నాటకం ప్రేక్షకులను ఆలోచింపజేసింది. శ్రీమావుళ్లమ్మ, సూర్యోదయ ఆర్ట్స్ భీమవరం వారిచే పులగం శివనాగ నర్సింహరావు ఆధ్వర్యంలో ఈ నాటకం ప్రదర్శించారు. తొలుత కోలాటం, భక్తి పాటలు, సినీ మ్యూజికల్ నైట్, భక్తులను అలరించాయి. కార్యక్రమంలో ఉత్సవ నిర్వాహకులు, నీరుల్లి కూరగాయ పండ్ల వర్తక సంఘం, అమ్మవారి ఉత్సవ కమిటీ, దేవస్థానం, సిబ్బంది ధర్మకర్తలు పాల్గొన్నారు.

మహిళా చట్టాలపై అవగాహన అవసరం



లైంగిక వేధింపులు నిరోధక చట్టంపై అవగాహన కల్పిస్తున్న జడ్జి శ్రీ సత్యాదేవి

భీమవరం: మహిళా చట్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని మూడో అదనపు న్యాయమూర్తి పి.శ్రీ సత్యాదేవి అన్నారు. మహిళలపై లైంగిక వేధింపుల నిరోధక చట్టంపై శనివారం భీమవరం కోర్టు సమావేశ మందిరంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన శ్రీసత్యాదేవి మాట్లాడుతూ లైంగిక వేధింపుల నిరోధక చట్టాలపై ప్రతి మహిళకు అవగాహన కలిగి ఉండాలన్నారు. హక్కులపై పూర్తిస్థాయిలో అవగాహన ఉన్నప్పుడే ఆత్మస్థైర్యం, సమస్యను ఎదుర్కొగలమన్న ధీమా ఉంటుందని చెప్పారు. జిల్లాలో మహిళలు, బాలికల హక్కులపై ఐసీడీఎస్ శాఖ, అనేక సంస్థలు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. నిందితుడిపై తీసుకున్న చర్యలు మీడియా ద్వారా ప్రచారం చేసినప్పుడే వారికి భయం ఉంటుందని అన్నారు. మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడితే పడే శిక్షలు, టోల్ ఫ్రీ నెంబరు బోర్డులు ప్రదర్శించాలని సూచించారు. సమావేశంలో న్యాయమూర్తులు బి.అప్పలస్వామి, ఎ.పవన్ కుమార్, జి.సురేష్ బాబు, డి.ధనరాజు, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎంవీ రమణారావు, జిల్లా ఐసీడీఎస్ అధికారి బి.సుజాతా రాణి, విద్యాశాఖ సహాయ సంచాలకులు కె.సంధ్య, ఆర్డీఓ కార్యాలయ ఏఓ ఎ.శివ కృష్ణ, ఆర్టీసీ పర్సనల్ ఆఫీసర్ ఎల్ గీతావాణి, కన్స్యూమర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వి.కరుణాకరరావు, వివిధ శాఖల సూపరింటెంట్లు, మహిళా ఉద్యోగులు, కోర్టు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రేపు ఉపాధి పనులపై సమావేశం

పాలకోడేరు: ఉపాధి హామీ పనులపై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం బహిరంగ సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కె.నాగేంద్ర కుమార్ తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో నిర్వహించిన ఉపాధి హామీ పనులపై ఆయా పంచాయతీల్లో చేసిన ఆడిట్ నివేదికలను సమర్పిస్తారని పేర్కొన్నారు.

రాష్ట్ర ఆర్యవైశ్య కార్యవర్గ సభ్యుడిగా రేపాక

పాలకొల్లు సెంట్రల్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ కార్యవర్గ సభ్యుడిగా పట్టణానికి చెందిన రేపాక నాగ వెంకట రత్న ప్రవీణ్ భాను, దక్షిణ ఆంధ్ర జోన్ ఆర్గనైజర్‌గా మాటూరి వీర వెంకట నర్సింహమూర్తిలు ఎంపికయ్యారు. శనివారం రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు చిన్ని రామసత్యనారాయణ నియామక పత్రాలు అందించినట్లు తెలిపారు. ఈ నెల 26న గుంటూరులో ప్రమాణ స్వీకారం ఉంటుందని పేర్కొన్నారు.

రెండో విడత 3,840 టిడ్కో ఇళ్ల అప్పగింత



లబ్ధిదారునికి టిడ్కో ఇంటి పట్టా, తాళం అందజేస్తున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్



సభకు హాజరైన టిడ్కో లబ్ధిదారులు

- ప్రజలకు మేలు చేయడమే లక్ష్యం
- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

భీమవరం(ప్రకాశం చౌక్): భీమవరం నియోజవర్గ ప్రజలకు మేలు చేయడమే లక్ష్యంగా దివంగత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలోనూ, నేడు ఆయన తనయుడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో పనిచేస్తున్నాని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. పట్టణంలో రెండో విడతగా 3,840 టిడ్కో గృహాల పంపిణీ కార్యక్రమం శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన గ్రంధి శ్రీనివాస్ మాట్లాడుతూ తొలి విడత 1984 గృహాలను లబ్ధిదారులకు అందించామన్నారు. రెండో విడత పంపిణీ చేసే గృహాల ఫినిషింగ్ పనులు నెలరోజుల్లో పూర్తవుతాయన్నారు. వచ్చే నెలలో ఎన్నికల నోటిఫికేషన్ రానుండడంతో ముందుగానే గృహాలను పంపిణీ చేస్తున్నట్టు చెప్పారు. ఇళ్ల స్థలాల కోసం తాను తొలిసారి ఎమ్మెల్యేగా పనిచేసిన సమయంలో దివంగత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి సహకారంతో 82 ఎకరాల భూమి సేకరించానని గుర్తుచేశారు. ఈ స్థలం ప్రజలకు ఇవ్వకుండా గత టీడీపీ ప్రభుత్వం వ్యక్తిగత టిడ్కో గృహాలు నిర్మించిందన్నారు. ఈ గృహాల పేరుతో చంద్రబాబు చేసిన కుంభకోణంపై రాష్ట్రంలోనే తొలిసారిగా తాను పూర్తి లెక్కలతో కరపత్రం వేశానని చెప్పారు. జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత 300 అడుగుల ఇళ్లు ఉచితంగా అందించడంతోపాటుగా మిగిలిన 365 అడుగులు, 430 అడుగుల ఇళ్లకు సంబంధించి డిపాజిట్ సొమ్ములో కూడా 50 శాతం రాయితీ ఇచ్చిందని వివరించారు. ప్రస్తుతం రెండో విడతగా పంపిణీ చేసిన ఇళ్లల్లో 300 అడుగుల ఇళ్లు 1280, 365 అడుగుల ఇళ్లు 1600, 430 అడుగుల ఇళ్లు 960 పంపిణీ చేస్తున్నట్టు చెప్పారు. మొత్తం 8,352 ఇళ్లకు ఇప్పటివరకు రెండు విడతల్లో 5,824 ఇళ్లు లబ్ధిదారులకు అప్పగించామన్నారు. టిడ్కో సముదాయానికి విద్యుత్, రోడ్ల సౌకర్యంతో పాటు పుష్కలంగా మంచినీరు సరఫరా అవుతుందని చెప్పారు.

చంద్రబాబు మరో రావణాసురుడు

టీడీపీ అధినేత చంద్రబాబు మరో రావణాసురుడని, పవన్ కళ్యాణ్ మాయలేడి ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ విమర్శించారు. నాడు సీతాదేవిని రావణాసురుడు ఏ విధంగా మాయచేసి తీసుకుపోయిన రీతిలో రానున్న ఎన్నికల్లో చంద్రబాబు రావణాసురుడి అవతారమెత్తి పవన్ కళ్యాణ్ అనే మాయలేడి సహకారంతో ప్రజలను మాయ చేయాలని చూస్తున్నారని విమర్శించారు. వారి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. చంద్రబాబు 2014 ఎన్నికల్లో 600కు పైగా హామీలిచ్చి వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారని గుర్తు చేశారు. భీమవరంలో నాడు 700 ఇళ్ల రుణాలను మాఫీ చేస్తానని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్క రూపాయి కూడా రుణమాఫీ చేయ్యని మోసకారి చంద్రబాబు అని విమర్శించారు. సీఎం జగన్, తాను నాడు నిర్మించిన 700 ఇళ్ల రుణాలను ఓటీఎస్ ద్వారా రుణమాఫీ చేశామని వివరించారు. నాడు వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకాన్ని తీసుకొచ్చి పేదవాడికి ప్రాణం పోసి జీవిత కాలాన్ని పెంచారని కొనియాడారు. అదే రీతిలో సీఎం జగన్ పేదల ఆరోగ్యానికి భద్రత కల్పిస్తూ వైఎస్సార్ ఆరోగ్యశ్రీని రూ.5 లక్షల నుంచి రూ.25 లక్షల వరకు అమలు చేస్తున్నారని చెప్పారు. పేదింటి పిల్లలను ఉచితంగా చదివించి డాక్టర్, ఇంజినీర్ వంటి ఉన్నత స్థాయి ఉద్యోగాల్లో నిలబెడుతున్నారని కొనియాడారు. కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీనివాసులు రాజు, టిడ్కో ఎస్ఈ బి.శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ ఎం.శ్యామల, ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాబు, పార్టీ నాయకులు ఏఎస్ రాజు, కామన నాగేశ్వరరావు, గూడూరి ఉమాబాల, ముల్లి నర్సింహమూర్తి, పాలవెల్లి మంగ, మానేపల్లి నాగేశ్వరరావు, నల్లం రాంబాబు, సుంకర బాబూరావు, వేండ్ర విజయదుర్గ, అల్లూరి నాగవల్లి, గంటా సుందర్ కుమార్, మద్దుల కరుణకుమార్, చెల్లబోయిన సూర్యప్రకాష్, సభాపతి, ములపర్తి స్వామి, కట్టా రవి, కొట్టు కుటుంబ రావు, కందికట్ల ఎడ్వర్డ్, షేక్ ఖాన్ అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో ఆదర్శంగా భీమవరం

ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్



35వ వార్డులో సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్



శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

భీమవరం (ప్రకాశంచౌక్): అభివృద్ధిలో భీమవరం నియోజకవర్గాన్ని రాష్ట్ర స్థాయిలోనే ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నానని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. భీమవరంలో నిర్మించిన పలు రోడ్లను శనివారం ఆయన ప్రారంభించారు. 34వ వార్డులో రూ.20.50 లక్షలతో సీత టవర్స్ నుంచి గోపీకృష్ణ టవర్ వరకు, ఎస్ఆర్కేఆర్ రోడ్డు నుంచి ఏఎస్ఆర్ కల్యాణ మండపం వరకు నిర్మించిన బీటీ రోడ్డును, 35వ వార్డులో రూ.19.50 లక్షలతో ఆదర్శనగర్ రెండో వీధి నుంచి వంశీకృష్ణ నగర్‌లోని కాస్మో క్లబ్ వెనుక వరకు నిర్మించిన సీసీ రోడ్డును ఆయన ప్రారంభించారు. 35వ వార్డులో రూ.29.50 లక్షల నిధులతో ఉండి రోడ్డు నుంచి వీఎస్ఎస్ గార్డెన్స్ వరకు నిర్మించిన బీటీ రోడ్డును, 36వ వార్డులో రూ.10.50 లక్షలతో సత్యవతి నగర్ టౌన్ స్టేషన్ కాంపౌండ్ వాల్ నుంచి ఎలక్ట్రికల్ సబ్‌స్టేషన్ వరకు నిర్మించిన సీసీ రోడ్డును, 37వ వార్డులో రూ.23.50 లక్షలతో నిర్మించిన బీటీ రోడ్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ గత నాలుగున్నర ఏళ్లుగా భీమవరం పట్టణాన్ని, నియోజకవర్గాన్ని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. 15 వేల మందికి పైనే ఇళ్ల స్థల పట్టాలను అందించామన్నారు. భీమవరం పట్టణంలో ఇప్పటి వరకు దాదాపుగా రూ.100 కోట్లకుపైగా అభివృద్ధి పనులు చేశామన్నారు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో తాను భీమవరంలో 100 పడకల ఆసుపత్రి కోసం ప్రతిపాదనలు చేశానని, నేడు ఆయన తనయుడు సీఎం జగన్ ఆధ్వర్యంలో నాలుగు ఎకరాల్లో 100 పడకల ఆసుపత్రి నిర్మాణం చేపట్టామని తెలిపారు. యనమదుర్రు డ్రెయిన్‌పై నిరుపయోగంగా ఉన్న వంతెనలకు అప్రోచ్ రోడ్ల నిర్మాణానికి రూ.36 కోట్లు మంజూరు చేయించామని, ప్రస్తుతం టెండర్ ప్రక్రియ కొనసాగుతుందని, త్వరలోనే పనులు ప్రారంభిస్తామని చెప్పారు. కంపోస్ట్ యార్డుకు ఆరున్నర ఎకరాల భూ సేకరణతోపాటు అక్కడికి వెళ్లేందుకు రోడ్డు నిర్మాణానికీ చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీపీ పేరిచర్ల విజయ నర్సింహరాజు, మున్సిపల్ మున్సిపల్ కమిషనర్ ఎం శ్యామల, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ కామన నాగేశ్వరరావు, గాదిరాజు సుబ్రహ్మణ్యరాజు, ఏఎస్ రాజు, నడింపల్లి అప్పలరాజు, చిలుకూరి బోసురాజు, గొట్టుముక్కల రామకష్ణంరాజు, సీతారామరాజు, చెన్ను చంటి, కొప్పర్తి వీర రాఘవులు, రేవూరి గోగిరాజు, పత్తి నరసింహారావు, దంతులూరి లక్ష్మీపతిరాజు, నాగదుర్గ, చిన్నమిల్లి వెంకటరాయుడు తిరుమాని రాము, మండలి నరేంద్ర, చింతలపాటి సుబ్రమణ్య రాజు, ముదునూరి స్వాతి సుబ్బరాజు, అడపా బాబ్జి, గొట్టుముక్కల సుబ్బరాజు, పూజారి రంగ, ముత్యాల బుజ్జి మానేపల్లి నాగన్న బాబు, తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి

భీమవరం: ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నప్పుడే ప్రజాస్వామ్యానికి మార్గదర్శకమని జిల్లా రెవెన్యూ అధికారి శివ నారాయణరెడ్డి అన్నారు. రెవెన్యూ శాఖ, శ్రీవిజ్ఞానవేదిక అధ్వర్యంలో ఓటు హక్కు వినియోగం ప్రజాస్వామ్య పరిరక్షణ అంశంపై నాచువారి సెంటర్‌లో రైతులు, కూలీలు, బంటా, తోపుడు బండ్ల వర్తకులతో ర్యాలీ, సదస్సు, ప్రతిజ్ఞ నిర్వహించారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి స్వచ్ఛమైన ఓటు ప్రతిజ్ఞ ఈవీఎంలపై వివరించారు. రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

సాంబశివరావుకు డాక్టరేట్

ఆకివీడు: ధ్యానం, ఆధ్యాత్మిక శాస్త్రాన్ని రెండున్నర దశాబ్దాలుగా బోధిస్తున్న ధాన్యరత్న ఉంద్రమట్ల సాంబశివరావుకు గౌరవ డాక్టరేట్ లభించింది. విజయవాడలో యూనైటెడ్ థియోలాజికల్ రీసెర్చ్ యూనివర్సిటీ శనివారం వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన వ్యక్తులకు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసిందని సాంబశివరావు తెలిపారు. ఆధ్యాత్మిక శాస్త్రవేత్త (స్పిర్చువల్ సైన్స్)లో తాను డాక్టరేట్ అందుకున్నట్టు చెప్పారు. ఆయన్ని స్పిర్చువల్ సొసైటీ జిల్లా కార్యదర్శి పీబీ ప్రతాప్‌కుమార్, ఎంవీ సూర్యనారాయణరాజు, యోగాసనాచార్యులు కందుల సత్యనారాయణ, కుంకట్ల సత్యనారాయణ, డీవీ రమణమూర్తి, బొబ్బిలి బంగారయ్య తదితరులు అభినందనలు తెలిపారు.

రాముడి పేరుతో బీజేపీ రాజకీయాలు

ఉండి: రాబోయే ఎన్నికల్లో లబ్ధి పొందేందుకే శ్రీరాముని పేరుతో బీజేపీ మతాన్ని రాజకీయాల్లోకి తెచ్చి లౌకిక రాజ్యాంగానికి తూట్లు పొడుస్తోందని సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు ఆరోపించారు. శనివారం మహదేవపట్నంలో నిర్వహించిన సీపీఐ సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఎన్నికల్లో దేశ ప్రజలకిచ్చిన వాగ్దానాలు అమలులో పూర్తిగా విఫలమైన ప్రధాని మోదీ రాముడి పేరుతో ఎన్నికల్లో అధికారంలోకి రావాలని రాజకీయ డ్రామాలాడుతోందని విమర్శించారు. నాయకులు కోన గొల్లయ్య, కలిశెట్టి వెంకట్రావు, తమ్మరాని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బ్రోచర్ ఆవిష్కరణ

భీమవరం : పశుగణ శాఖాభివృద్ధి శాఖ ఏటా జనవరి 14 నుంచి 30 వరకు జంతు పరిరక్షణ పక్షోత్సవాలను నిర్వహిస్తున్నట్టు పశుగణ శాఖాభివృద్ధి ఏడీ సత్యనారాయణ తెలిపారు. జిల్లా పశుగణ శాఖాభివృద్ధి శాఖ, జంతు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జంతు పరిరక్షణ పక్షోత్సవాల బ్రోచర్‌ను శనివారం విడుదల చేశారు. జిల్లా పశుగణ శాఖాభివృద్ధి శాఖ డైరెక్టర్ గంటా సుందర్ కుమార్ మాట్లాడుతూ ఈ పక్షోత్సవాలను జయప్రదం చేయాలని అన్నారు. చెరుకువాడ రంగసాయి, సుంకర దాసు మాట్లాడుతూ 30 తేదీ వరకు అవగాహన సదస్సులు, వివిధ పోటీలు నిర్వహిస్తామని, విజేతలకు బహుమతులు అందజేస్తామని తెలిపారు.

అయోధ్య రాముని అక్షింతల పంపిణీ



18వ వార్డులో అక్షింతలు అందజేస్తున్న దృశ్యం



బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న దృశ్యం

భీమవరం: స్థానిక పేరంటాల చెరువు గట్టు వద్ద శనివారం అయోధ్య రాముని అక్షింతలు పంపిణీ చేశారు. వేద పండితుడు వేలూరి వెంకట్రామయ్య శర్మ మాట్లాడుతూ 500 ఏళ్ల పోరాటం తర్వాత అయోధ్య రాముని మందిర ప్రతిష్ఠ కార్యక్రమం ఈనెల 22న సాకరమవుతోందన్నారు. శ్రీరామ జన్మభూమి తీర్థ ట్రస్ట్ అందించిన అంక్షితలు అందరూ అందుకుని, రామనామ సంకీర్తన చేస్తూ, ఆ ప్రతిష్ఠ వైభవాన్ని వీక్షించాలని కోరారు. ఇంటింటా అంక్షితలు, శ్రీరాముని చిత్రపటం, అయోధ్య రామ మందిర నిర్మాణ కరపత్రం అందజేశారు. కార్యక్రమంలో అరసవల్లి ఈశ్వరమ్మ వీర వెంకటాచారి చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు అరసవల్లి సుబ్రహ్మణ్యం, అల్లు శ్రీనివాస్, పరిమి రామకృష్ణ, ఇందుకూరి శివాజీ వర్మ, అరసవల్లి మణికంఠ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

మార్మోగిన జై శ్రీ రామ్ నినాదం

భీమవరం: అయోధ్య రామాలయ ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం ఉదయం డీఎన్నార్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శోభాయాత్రలో భాగంగా బైక్ ర్యాలీ నిర్వహించారు. భీమవరం పురవీధుల్లో జై శ్రీ రామ్ నినాదాలతో ప్రకాశం చౌక్ మీదుగా డీఎన్నార్ గ్రౌండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని కె.శివరామరాజు జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కటికల పల్లారావు, సెక్రటరీ పాకలపాటి సీతారామ రాజు, పీఆర్ఓ కొప్పినీడి సూర్యప్రకాష్, సాగి త్యాగరాజు, ట్రెజరర్ విజయ రామకృష్ణ, అడపా బాబ్జి, సీసలి రాము, వెంకటరాజు, కొప్పర్తి శ్రీను, బొక్కా శ్రీనివాస్, మానేపల్లి చిన్నారావు, బోండా రాంబాబు, భట్టిప్రోలు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆక్వా రంగానికి రాష్ట్ర ప్రభుత్వం వెన్నుదన్ను



గాదిరాజు వెంకటసుబ్బరాజు

భీమవరం: ఆక్వా రంగానికి రాష్ట్ర ప్రభుత్వం వెన్నుదన్నుగా ఉందని ఆక్వారైతుల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గాదిరాజు వెంకటసుబ్బరాజు అన్నారు. శనివారం భీమవరంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. అప్సడా చట్టం ఏర్పడిన నాటి నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, అప్సడా వైస్ చైర్మన్ వడ్డి రఘురామ్ దృష్టికి ఆక్వా సమాఖ్య అనేక సమస్యలు తీసుకువెళ్లడంతో ఫీడ్ ధరలు తగ్గించడంలోనూ, నాణ్యమైన సీడ్ సరఫరా చేయడానికి సీడ్ హేచరీ యజమానులు, ఫీడ్ కంపెనీలతో మాట్లాడి రైతులకు మేలు చేకూర్చారని వివరించారు. రొయ్యల కొనుగోలుదారులతో మాట్లాడం ద్వారా ధరలు మరింత తగ్గిపోకుండా చేసిన కృషి ప్రశంసనీయమని కొనియాడారు. విద్యుత్ సబ్సిడీ విషయంలో 10 ఎకరాల్లోపు రైతులందరికీ రాష్ట్ర ప్రభుత్వం ప్రయోజనం చేకూర్చిందని తెలిపారు. కొత్తగా విద్యుత్ కనెక్షన్స్ తీసుకున్న రైతులకు కూడా సబ్సిడీ వర్తించే విధంగా రఘురామ్ కృషి చేస్తున్నారని చెప్పారు. ఆక్వా రంగ ప్రధాన కార్యాలయాలు భీమవరంలో ఏర్పాటుచేయడానికి ప్రభుత్వం అంగీకరించదని, ప్రభుత్వం అన్నిరకాలుగా ఆక్వా రైతులకు మేలు చేస్తున్న తరుణంలో సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ఆక్వా సమాఖ్య మరింత ముందుకెళుతోందని చెప్పారు. సమస్యలన్నీ ఏకకాలంలో పరిష్కారమ్యే అవకాశం లేనందున రైతులు కూడా సానుకూలంగా ఆలోచించాలని సుబ్బరాజు కోరారు.

ముమ్మరంగా దాళ్వా వరి నాట్లు



యనమదుర్రులో వరినాట్లు వేస్తున్న కూలీలు

భీమవరం అర్బన్: మండలంలోని ముమ్మరంగా దాళ్వా వరినాట్లు వేసే ప్రక్రియ ముమ్మరమైంది. గత సార్వాలో తుపాను దాటికి కొన్ని ప్రాంతాల్లో నష్టాలు మిగల్చడంతో దాళ్వా సాగుపై భారీ ఆశలతో సాగు చేపట్టారు. యనమదుర్రు, దిరుసుమర్రు, గొల్లవానితిప్ప గూట్లపాడు, అనాకోడేరు, కొమరాడ, తుందుర్రు, తుమ్మగొప్పు, చినఅమిరం, రాయలం, తాడేరు, బేతపూడి, వెంప తదితర గ్రామాల్లో సుమారు 9 వేల ఎకరాల్లో దాళ్వా సాగుకు శ్రీకారం చుట్టారు. ఇప్పటి వరకు దిరుసుమర్రు, యనమదుర్రు, గునుపూడి, తాడేరు తదితర గ్రామాల్లో 20 శాతం వరినాట్లు పూర్తయ్యాయి. ముందస్తుగా వరినాట్లు వేస్తే మార్చి, ఏప్రిల్ మొదటి వారానికి పంట చేతికి వస్తుందని, లేకుంటే కాలువలకు నీటి విడుదల ఆపేస్తే పంట దెబ్బతింటుందని ఇప్పటికే అధికారులు రైతులకు అవగాహన కల్పించారు. దీంతో రైతులు దమ్ములు, దుక్కులు, గట్టు లంకలు, వరి నాట్లు తదితర వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు.

కూలీల కొరతతో వరినాట్లు

మండలంలో అన్ని గ్రామాల్లో ఒకేసారి వరినాట్లు ప్రారంభించడంతో కూలీల కొరత ఏర్పడింది. వరినాట్లు ఆలస్యమవకుండా కొందరు రైతులు వలస కూలీలను రప్పించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. కూలీలకు అదనంగా రూ.100 నుంచి రూ.500 వరకు బేటాలు ఇచ్చి పని పూర్తిచేయించుకోవాల్సి వస్తోందని రైతులు చెబుతున్నారు.

వెదజల్లే పద్ధతి మేలు



దాళ్వా వరినాట్లు ఆలస్యమైతే వెదజల్లే పద్ధతి అనుసరిస్తే రెండు వారాల సమయంతో పాటు ఎకరానికి రూ.2 వేలు నుంచి రూ.4 వేలు ఆదా అవుతుంది. ఇది దిగుబడిపై ప్రభావం చూపదు.

నిమ్మల శ్రీనివాస్, ఏవో, భీమవరం మండలం

కబడ్డీ విజేత అగ్రహారం జట్టు



కబడ్డీ విజేత అగ్రహారం జట్టుతో అధికారులు

ఉండి: ఆడుదాం ఆంధ్ర క్రీడల్లో భాగంగా శనివారం ఉండి జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన పురుషుల కబడ్డీ ఫైనల్‌లో ఎన్నార్పీ అగ్రహారం జట్టు విజేతగా నిలిచింది. కబడ్డీ ఫైనల్స్‌లో ఎన్నార్పీ అగ్రహారం జట్టు 36 – 10 పాయింట్లతో కలిసిపూడి జట్టుపై విజయం సాధించింది. ఈ జట్టు నియోజకవర్గ స్థాయి పోటీలకు అర్హత సాధించింది. ప్లేయర్ ఆఫ్ ద టోర్నీగా గుమ్మడి ప్రభాస్ నిలిచారు. ప్లేయర్ ఆఫ్ ద టోర్నీగా గుమ్మడి ప్రభాస్ నిలిచారు. ఆడుదాం ఆంధ్ర మండల ఇన్‌చార్జి జీవీ కృష్ణంరాజు, డీపీఓ మల్లికార్జునరావు, ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు, ఎంపీడీఓ ఎస్ రవీంద్ర, ఈవోపీఆర్‌డీ కె.కొండలరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు సూరవరపు వెంకటాచార్యులు, గలావిల్లి ధనుంజయ తదితరులు విజేత జట్టును అభినందించారు.